

# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 28-05-2022 సంపుటి : 03 సంచిక : 249 పేజీలు : 4 వెల : రూ 3-00





# రాష్ట్ర భవిష్యత్ కోసం పోరాడుతాం

**వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు**
**దద్దమ్మ పాలన వల్ల ఏపీ పరువు పోయింది**
**టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు..మహిళలపై పెరిగిన దాడులు**
**ఒక ఉన్మాది పాలన ఏపీకి శాపందోచుకోవడం..దాచుకోవడమే వారి పని**
**పన్నులు, ధరలతో ప్రజలపై బాదుడే..బాదుడుఅమ్మ ఒడి అన్నారు.. నాన్న బుడ్డీ పెట్టారు**
**జగన్ కి పాలించే అర్హత లేదు**
**ఒంగోలు మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు**



ఒంగోలు ఒక ఉన్మాది పాలన ఏపీకి శాపంగా పరిణమించిందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని అరాచక పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. కబ్జాలు, దోపిడీలు పెరిగిపోయాయని దుయ్యబట్టారు. చేతకాని దద్దమ్మ పాలన వల్ల ఏపీ పరువు మొత్తం పోయిందని విమర్శించారు. ఒంగోలులో సీక్రవారం ప్రారంభమైన మహానాడు కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహానాడు అంటే గుర్తొచ్చేది ఎన్టీఆర్ అని, ఇది తెలుగువారి పండుగ అని అన్నారు. తెలుగుదేశం వెనుకబడిన తరగతుల పార్టీ అని చెప్పారు.వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా మాట్లాడిన టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి, అరెస్ట్ చేశారని, టీడీపీ కార్యకర్తలు అరెస్ట్ అయినప్పుడల్లా తాను నిద్రలేని రాత్రులను గడిపానని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దోచుకోవడం తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ప్రతి దాంట్లో బాదుతున్నారని అన్నారు. సరఫరా చేయని కరెంట్ పై కూడా బాదుడే బాదుడని అన్నారు. చెత్తపై, డ్రైనేజీపై, పెట్రోల్ పై ఇలా ప్రతి దానిపై జనాలను బాదుతున్నారని మండిపడ్డారు. పన్నులు, ధరలతో బాదేస్తున్నారని చెప్పారు. ఇసుక, సిమెంట్ ధరలను పెంచేశారని అన్నారు. సిమెంట్ ధరలు పెరగడంతో నిర్మాణరంగం దెబ్బతిన్నదని చెప్పారు. రాష్ట్రంలో నిత్యావసరాలు కొనలేని పరిస్థితి ఉందని అన్నారు. మహిళలపై పెరిగిన దాడులు : ఏపీలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని చంద్రబాబు అన్నారు. వైసీపీ నేతలు కరుడుగట్టిన నేరస్తులని అన్నారు. నిలదీస్తే దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. కేసులకు, లాఠీలకు భయపడమని చెప్పారు. జగన్ పాలనలో సంక్షేమం అనేది ఒక బూటకమని చెప్పారు. అమ్మ ఒడి అన్నారు..నాన్న బుడ్డీ పెట్టారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని అన్నారు. పెట్రోల్ ధరలను కేంద్రం తగ్గించినా, రాష్ట్రం తగ్గించడం లేదని విమర్శించారు.చేతకాని దద్దమ్మ వల్ల రాష్ట్రం పరువు పోతోంది : మహానాడు తెలుగుజాతికి పండుగ అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చరిత్ర ఉన్నంత వరకూ టీడీపీ ఉంటుందన్నారు. పసుపు రంగు చూస్తే చైతన్యం వస్తుందన్నారు. రాజకీయం అంటే తమాషా కాదన్నారు. రాష్ట్రంలో ఉన్మాది పాలన కొనసాగుతోందన్నారు. చేతకాని దద్దమ్మ జగన్) వల్ల రాష్ట్రం పరువు పోతోందన్నారు. "టీడీపీ కార్యకర్తలను ఎంతగా ఇబ్బంది పెడితే.. అంతగా రెచ్చిపోతారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పోరాడుతాం. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బాదుడే బాదుడు. వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. ఎవరు తప్పు చేసినా వదిలేది లేదు. ప్రజా సమస్యలపైనే మన పోరాటం. రాష్ట్రంలో ఏ రైతు ఆనందంగా లేరు. దిక్కుతోచని పరిస్థితుల్లోనే రైతుల ఆత్మహత్యలు. రైతు సమస్యల పరిష్కారం పోరాటం చేస్తాం. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు. రోడ్డు మీదకు రండి...మీకు అండగా మేము ఉంటాం. రాష్ట్రంలోని ప్రజా సమస్యలపైనే మన పోరాటం. పెట్రోల్ ధరలు కేంద్రం తగ్గించినా వైసీపీ ప్రభుత్వం తగ్గించడం లేదు. ఇంటిపన్ను, చెత్తపన్ను, డ్రైనేజీ ట్యాక్స్ అన్నీ పెంచేశారు. రాష్ట్రంలో ఏ రైతు అయినా ఆనందంగా ఉన్నాడా? అమ్మ ఒడి అన్నారు.. నాన్న బుడ్డీ పెట్టారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు.. రోడ్లపైకి రండి. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి. మోటార్లకు మీటర్లు పెట్టి రైతు మెడకు ఉరేసే పరిస్థితి తీసుకొస్తారా? రాష్ట్రంలో నిత్యావసరాలు కొనే పరిస్థితి లేదు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను తీసేశారు. విదేశీ విద్య, పెళ్లి కానుక పథకాలన్నీ ఏం చేశారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు.




# ప్రారంభమైన యోగా ఉత్సవ్



హైదరాబాద్, మే 27, (ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం యోగా మహోత్సవ్ కార్యక్రమం జరిగింది. జూన్ 21 న యోగ డే నేపథ్యంలో యోగ ఉత్సవ్ 25 రోజుల ఉత్సవ కార్యక్రమం హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియం లో నేడు ప్రారంభమయింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఈ యోగ ఉత్సవ్ 25 రోజుల ప్రారంభ కార్యక్రమానికి గవర్నర్ తమిళసై సౌందర రాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవ కార్యక్రమాన్ని తమిళసై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సర్బానంద, సినీ నటులు మంచు విష్ణు, లావణ్య త్రిపాఠి, తేజ సజ్జా, ప్రముఖ క్రికెట్ క్రీడాకారిణి మితాలి రాజ్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైశ్వల్, బీజేపీ నేతలు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజా సింగ్ తో పాటు ఇతర ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. ఈ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ యోగా నేత్రుత్వంలో నిర్వహించ బడుతున్నటువంటి ఈ యోగ ఉత్సవాలు 25 రోజుల పాటు కొనసాగనున్నాయి.ఈ యోగా వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మరో 25 రోజుల్లో యోగ డే సందర్భంగా.. కౌంట్ డౌన్ యోగ దినోత్సవ వేడుకలను ఈ రోజు నుంచి నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దేశంలోని 75 ప్రాంతాల్లో సహా అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లో కూడా 75 రోజులు ఈ యోగ ఉత్సవ వేడుకలను నిర్వహించబోతున్నామని ప్రకటించారు. జూన్ 21 వరకు ప్రతి ఈ వేడుకలు నిర్వహించి.. అంతర్జాతీయ యోగ దినోత్సవంగా జూన్ 21న ట్యాంక్ బండ్ వద్ద భారీ యోగ వేడుకను నిర్వహించబోతున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. ప్రతి వృత్తిలో యోగా ను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలు అన్నీ జూన్ 21 యోగ వేడుకలు జరగ బోతున్నాయి.. భారత ప్రభుత్వం తరపున కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి...జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచే కౌంట్ డౌన్ ప్రారంభించారు. 25రోజుల పాటు వివిధ వేదికల ద్వారా కౌంట్ డౌన్ లో భాగంగా కేంద్ర సాంస్కృతిక, ఆయూష్ శాఖలు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారుఈ సందర్భంగా మాట్లాడిన కిషన్ రెడ్డి.. "భారత ప్రభుత్వం తరపున వందరోజుల ముందు ఢిల్లీలో నిర్వహించాం. జూన్ 21న పెద్ద ఎత్తున జరిగే యోగా కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలి. 200దేశాలలో అంతర్జాతీయ యోగా దేను జరుపుకుంటున్నాయని" అన్నారు.యోగాడే విజయవంతంగా జరపబడుతుంది. ఆయూష్‌తో పాటు కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహిస్తున్నాం. శుక్రవారం నగరంలో యోగా వేడుకలు నిర్వహించామని. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రజలు పాల్గొన్నారని...మానవ సమాజం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు.

# గత పాలనలో సాంకేతికతపై ఉదాసీనత..

**డ్రోన్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో మోదీ**




ఢిల్లీ: ప్రభుత్వ పాలనలో 2014 ముందువరకు సాంకేతిక వినియోగంపై ఉదాసీనత ఉండేదని.. దీని కారణంగా పేదలు, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నష్టపోయారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.టెక్నాలజీని ఒక సమస్యగా చూశారని, అది పేదలకు వ్యతిరేకమని ముద్ర వేసే ప్రయత్నాలు జరిగినట్లు ఆరోపించారు. ఢిల్లీలో శుక్రవారం 'భారత్ డ్రోన్ మహోత్సవ్- 2022'ను ప్రారంభించిన ప్రధాని.. అనంతరం ఈ మేరకు ప్రసంగించారు. డ్రోన్ టెక్నాలజీపై దేశంలో కనిపిస్తున్న ఉత్సాహం అద్భుతంగా ఉందని, అభివృద్ధి చెందుతోన్న ఈ రంగం ఉపాధి కల్పనలో విస్తృత అవకాశాలను సూచిస్తోందని తెలిపారు. గ్లోబల్ డ్రోన్ హబ్‌గా మారే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు.'ఎనిమిదేళ్ల క్రితం మేం సుపరిపాలన కొత్త సూత్రాలను అమలు చేయడం ప్రారంభించాం. 'కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన' మార్గాన్ని అనుసరిస్తూ.. సులభతర జీవనం, వ్యాపార నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చాం. ప్రభుత్వ ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరుకోవడంలో సాంకేతికత చాలా సాయపడింది. 'డ్రోన్ సాంకేతికత' ఎంత పెద్ద విప్లవానికి ప్రాతిపదికగా మారుతుందో చెప్పడానికి ప్రధానమంత్రి స్వామిత్వ పథకం ఒక ఉదాహరణ. దీని కింద మొదటిసారి గ్రామాల్లోని ప్రతి ఆస్తిని డిజిటల్ మ్యాపింగ్ చేసి, ప్రజలకు డిజిటల్ ప్రాపర్టీ కార్డులను అందజేస్తున్నాం. వ్యవసాయం, క్రీడలు, రక్షణ, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది' అని ప్రధాని అన్నారు.టెక్నాలజీ రంగంలో భారత్ ఒకప్పుడు ఇతర దేశాలను అనుసరించేదని.. కానీ, ఇప్పుడు అగ్రగామిగా మారిందని పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. పేదల ప్రయోజనానికి ఉపయోగపడినప్పుడే సాంకేతికత విజయవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. డ్రోన్ టెక్నాలజీ అలాంటిదేనని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. దేశంలోనే అతిపెద్ద డ్రోన్ ఉత్సవమైన ఈ కార్యక్రమం మే 27, 28 తేదీల్లో కొనసాగనుంది. ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, అశ్విని వైష్ణవ్, భూపేందర్ యాదవ్, గిరిరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. విదేశీ దౌత్యవేత్తలతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, డ్రోన్ స్టార్టప్‌లకు చెందిన 1,600 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొంటున్నారు.

# 'వంచన, వెన్నుపోటుకు పుట్టిన బిడ్డే ఉన్మాది చంద్రబాబు'

**వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి**

తాడేపల్లి: వంచన అనే తండ్రికి, వెన్నుపోటు అనే తల్లికి పుట్టిన ఉన్మాది చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన ఉన్మాది చంద్రబాబు అని ధ్వజమెత్తారు.బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబు ఎందుకు పగ సాధిస్తున్నారు. "కిక్ బాబు-సేవ్ ఏపీ" నినాదంతో వైఎస్సార్‌సీపీ ముందుకు వెళ్తోంది. ఎంతో ఉన్నతాశయంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. నారా అంటే నాసి రకం రాజకీయ నాయకుడు. చంద్రబాబును తరిమికొడితేనే ఏపీకి మంచి రోజులు. 14 సంవత్సరాల్లో చంద్రబాబు ఏం సాధించారు? ఒక్క ప్రాజెక్టునైనా ఆయన పూర్తి చేశారా? అని" విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు సంతోషంగా ఉన్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతోందని విజయసాయిరెడ్డి అన్నారు.



# ఆనాడు నేను ఉన్నాను.. నేను విన్నాను... అన్నారు: జీవీఎల్



అమరావతి : 'ఆనాడు నేను ఉన్నాను.. నేను విన్నాను... అన్నారు.. నేడు నేను మర్చిపోయాను అంటున్నారని ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సీఎం జగన్ సర్కార్ అన్నిరంగాల్లో విఫలమై అరాచకాలకు పాల్పడుతోందన్నారు. సామాజిక న్యాయం పేరుతో మంత్రులు ఊరేగుతున్నారన్నారు. అసెంబ్లీ స్పీకర్ కూడా అందులో ఉపన్యాసాలు ఇస్తున్నారని జీవీఎల్ పేర్కొన్నారు. తమ్మినేని రాజకీయాలు చేయాలనుకుంటే స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని జీవీఎల్ పేర్కొన్నారు.

# ఆ పదవి నుంచి తప్పుకుంటా : నారా లోకేశ్



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రెండు భారీ కుంభకోణాలను మహానాడు తరువాత బయటపెడతానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. ఒంగోలులో జరుగుతున్న టీడీపీ మహానాడు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ నేతలకు దీర్ఘకాలం పదవుల విధానం రద్దు ప్రతిపాదన పెట్టానని అన్నారు. వరుసగా మూడుసార్లు ఎన్నికల్లో ఓడిన వారికి ఈసారి ఎన్నికల్లో టికెట్లు ఇవ్వరాదని విస్తృతంగా చర్చిస్తున్నామని తెలిపారు. ఈ విధానాన్ని తనతోనే అమలు చేయాలని భావిస్తున్నానని వివరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు పనిచేశానని ఈసారి తప్పుకుని మరొకరికి అవకాశం కల్పిస్తానని చెప్పారు. రెండు సార్లు ఒకే పదవిలో ఉన్నవారికి విరామం ఇవ్వాలని అన్నారు. ఏపీలోని ముప్పై నియోజకవర్గంలో సరైన టీడీపీ అభ్యర్థులను నియమించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో చంద్రబాబు స్పష్టతతో ఉన్నారని తెలిపారు.

# సంపాదకీయం

శనివారం 28-05-2022

## ప్రపంచానికి దిక్సూచిగా భారత్

ప్రపంచానికి దిక్సూచిగా భారత్ నిలువనుందా?. ముమ్ముందు భారత్ ఆలోచనలతో మిగతా దేశాలు ఏకీభవించనున్నాయా?. ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలో భారత్ ఉన్నత శిఖరాలకు చేరుకోనుందా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. క్వాడ్ కూటమి(భారత్, జపాన్, ఆస్ట్రేలియా, అమెరికా) నేతల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ..ఆదివారం జపాన్ చేరుకున్న సంగతి తెలిసిందే. భారత్ లో పెట్టుబడుల అవకాశాలను వివరిస్తూ, జపాన్ ? భారత్ మధ్యనున్న మైత్రి బంధాన్ని మరింత ధృడ పరుచుకుంటున్నాయని మోదీ అన్నారు. సోమవారం జపాన్ లోని పలు కార్పొరేట్ ప్రతినిధులతో సమావేశమైన ప్రధాని మోదీ..భారత్ లో పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపై పూర్తి వివరణ ఇచ్చారు. జపాన్ లో జరుగుతున్న ఈ సమావేశానికి క్వాడ్ కూటమిలోని మిగతా దేశాధినేతలు సైతం పాల్గొన్నారు.కేవలం ఐదు దేశాలకు మాత్రమే ఇప్పటి వరకు విటో పవర్ ఉంది. ప్రపంచంలో శక్తివంతమైన దేశాలైన చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికాలకు మాత్రమే ఇప్పటి వరకు విటో పవర్ సొంతం. కానీ ఇప్పుడు యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ లో పర్మనెంట్ మెంబర్ షిప్ కోసం జపాన్ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు జొబైడెన్ సమర్ధించారు. జపాన్ ప్రయత్నానికి తాము సపోర్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిడాతో టోక్యోలో అమెరికా అధ్యక్షుడు ఒకరితో ఒకరు భేటీ అయిన సందర్భంలో ఈ విషయంపై చర్చ జరిగింది. గత సంవత్సరం భారత్ చేసిన ఇదే ప్రయత్నానికి జొబైడెన్ రెండు సార్లు మద్దతు ప్రకటించారు.అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి ఇదే విషయంపై డిమాండ్ పెరుగుతోంది. యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ లో దేశాల సంఖ్య పెరగాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం దీనిలో ఉన్న కొన్ని దేశాలకు ఎక్కువ ప్రయారిటీ ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం కొన్ని దేశాలకు మాత్రమే విటో పవర్ ఉండటం కారణంగా అనేక సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే నలుగుతున్నాయని అనేక దేశాలు ఆరోపిస్తున్నాయి. పర్మనెంట్ మెంబర్లకు మాత్రమే విటో పవర్ అనే సిద్ధాంతం విషయంలో మార్పులు అవసరమని వారు అంటున్నారు.కేవలం కొన్ని దేశాల చేతిలోనే విటో పవర్ ఉండటం కారణంగా యూఎన్ పనితీరు బలహీనంగా

మారుతోందని అనేక దేశాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని పరిశీలించినప్పుడు సైతం మనకు ఇది స్పష్టంగా కనిపిస్తోంది. సమస్య పరిష్కారానికి ఈ పవర్స్ అడ్డుపడుతున్నాయి. భద్రతా మండలి పనితీరు బాగుండాలంటే సమకాలీన వాస్తవాలను తప్పక పరిగణలోకి తీసుకోవాలని అనేక దేశాలు కోరుతున్నాయి. జఔఇఅ మరింత మంది సభ్యులు అవసరమంటూ ఇప్పటికే జపాన్, ఇండియా, జర్మనీ, బ్రెజిల్ తో పాటు ఆఫ్రికా దేశాలు సైతం తమ డిమాండ్లను వ్యక్తపరిచాయి. ప్రస్తుతం 193 దేశాలు యూఎన్ సభ్యులుగా ఉన్నప్పటికీ కేవలం ఐదు దేశాలో పర్మనెంట్ మెంబర్లుగా ఉన్నాయి. సూపర్ పవర్ స్థానం కోసం అమెరికా, రష్యా, చైనాలు చేస్తున్న ప్రయత్నాలు కోల్డ్ వార్ కు కారణంగా మారుతున్నాయి. ఇందువల్ల కేవలం పర్మనెంట్ సభ్యులు మాత్రమే విటో పవర్ కలిగి ఉండాలా అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోందిడిసెంబర్ 1న, బాలిలో జరిగే శిఖరాగ్ర సమావేశంలో ఇండోనేషియా ఉ –20 అధ్యక్ష పదవి ముగిసే సమయానికి, కనీసం ఐదుగురు సభ్యులకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందాలని భారత్ ప్రకటించాలి. ఖ–5 దేశాల నుంచి ప్రజా నిబద్ధతను కోరాలి. ఎవరు హాజరవుతారు. వ్యతిరేకత విషయంలో, నిరసనకు చిహ్నంగా పరిమిత కాలం పాటు ప్రపంచ సంస్థలో దాని భాగస్వామ్యాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించాల్సిన అవసరం ఉన్నట్లు నిపుణులు అంటున్నారు.యుక్రెయిన్ ? రష్యా సంక్షోభంపై భారత్ స్పందించిన తీరు, రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు, అమెరికా ప్రభుత్వానికి భారత విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ ఇచ్చిన కౌంటర్లు, శ్రీలంకకు ఆర్ధిక సహాయం, ఇతర మిత్ర దేశాలతో సఖ్యత వంటి వ్యవహారాల్లో భారత్ ఎంతో చురుకుగా వ్యవహరిస్తోంది. ఈక్రమంలో నరేంద్ర మోదీ తీసుకుంటున్న చర్యలే విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను మరింత పెంచినట్లు బీజేపీ నేతలు చెప్పుకొస్తున్నారు. త్వరలోనే ప్రపంచ దేశాలకు భారత్ దిక్సూచిలా మారనుందని భారతీయ నెటిజన్లు అంటున్నారు

# మంత్రి గారు డబ్బా కొట్టి మరీ సెల్ఫ్

కాకినాడ, మే 27, సీదిరి అప్పలరాజు. కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి. ఇంఛార్జ్ మినిస్టర్గా బాధ్యతలు చేపట్టాక.. జిల్లా సమావేశాలలో ఆయన తీరు ప్రశ్నగా మారింది. అధికారులను ఇరుకున పెడదామని ఆయన చేస్తున్న ప్రయత్నాలు చర్చగా మారుతున్నాయి. తాను స్పెషల్గా కనిపించాలనో ఏమో ప్రతి చిన్న విషయానికీ గంటల తరబడి సుదీర్ఘ ప్రసంగాలు చేస్తున్నారట. ఎవరైనా అధికారులు మంత్రి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పబోతుంటే.. ఐ నో ఎవ్రీథింగ్.. ప్లీజ్ సిట్ డౌన్.. అని ఇంగ్లీష్లో ఏకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నట్టు చెవులు కొరుక్కుంటున్నారు. జవాబు చెప్పేందుకు కుర్చీలో నుంచి పైకిలేచిన ఆఫీసర్లు చిన్న బుచ్చుకుంటున్నారట. అడగడం ఎందుకు.. చెప్పేవరకు ఆగకుండా ఈ వన్మ్యాన్ షో ఏంటని బయటకొచ్చాక సెటైర్లు పేలుతున్నాయట. చివరకు అమాత్యులవారు చెప్పింది తప్పు అని తెలిశాక నాలుక కరుచుకుంటున్నారట. పైగా తన దగ్గర మిస్టేక్స్ జరగబోవని.. తాను ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ని అని చరిత్ర తవ్వుకు వస్తున్నారట. అక్కడితే ఆగితే బాగోదని అనుకుంటున్నారో ఏమో.. తాను గోల్డ్ మెడల్ కూడా తీసుకున్నానని.. మీకు కుడా తెలిసే ఉంటుందని సమావేశంలో ఉన్నవారిని ఇన్వాల్వ్ చేస్తున్నారట అప్పలరాజు.కాకినాడ గురించి తనకంతా తెలుసని.. ఇక్కడే చదువుకున్నానని హితబోధ చేస్తున్నారట మంత్రి అప్పలరాజు. జిల్లాలో క్రమశిక్షణ తప్పడం వల్లే.. జూనియర్ను అయినా తనకు సీఎం ఇక్కడ బాధ్యతలు అప్పగించారని గొప్పలకు పోతున్నారట. అయితే ప్రతి సమావేశంలోనూ ఈ సెల్ఫ్డబ్బా ఏంటి మహాప్రభో అని లబోదిబో మంటున్నారట అధికారులు. జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధుల్లో ఎక్కువమంది అప్పలరాజు కంటే రాజకీయాల్లో సీనియర్లే. ఒకరిద్దరు తప్ప అంతా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వాళ్లను కూడా మంత్రి లైట్ తీసుకుంటున్నారట. కొన్నిసార్లు సీనియర్లను ఏకవచనంతో పిలుస్తూ కామెడీ చేయాలని చూస్తున్నారట. దీంతో ఆ ప్రజాప్రతినిధులకు చిర్రెత్తికొస్తోందట.ఇక్కడ ఇంకో గమ్మత్తు ఉంది. జిల్లాలో ప్రజాప్రతినిధులు స్కూల్ టీచర్లయితే.. తాను డీఈవో లాంటి వాడినని.. ఎప్పుడైనా ఎవరినైనా ఏదైనా అడిగే హక్కు తనకు ఉందని తనస్థాయి గురించి చెప్పే ప్రయత్నం చేస్తున్నారట మంత్రి అప్పలరాజు. దీంతో ఇంఛార్జ్ మంత్రులుగా గతంలో చాలామందిని చూశామని..

కానీ ఇదెక్కడి గోల అని లోలోన మథన పడుతున్నారట. ఈ విషయాన్ని పైకి చెబితే ఒక తంటా.. చెప్పకపోతే మరో తంటాలా తయారైందని తమలో తామే సర్ది చెప్పుకుంటున్నారట. అప్పలరాజు మాత్రం రొటీన్గా తన స్టైల్లో తాను వెళ్తూ ఎస్టాబలీష్ కావడానికి అన్ని ప్రయత్నాలు చేయడం విశేషం. కొన్నిసార్లు కిందపడ్డా తనదే పైచెయ్యి అన్నట్టుగా మంత్రి తీరు ఉ ంటోందట. ప్రతి విషయంలోనూ శ్రీకాకుళంజిల్లాతో పోల్చుతూ.. అక్కడ అంతా అభివృద్ధి జరిగిందంటే తాను కూడా కారణమని చెబుతున్నారట మంత్రిగారు. కాకినాడ జిల్లాలో అంతా దానిని ఫాలోకావాలని సూచిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ కూడా అదే ఫార్ములా వర్కవుట్ చేస్తానని నొక్కి వక్కాణిస్తున్నారట అప్పలరాజు.మొత్తానికి అప్పలరాజు ఏదో చేయబోయి. మరేదో చెప్తూ అడ్డంగా బుక్కైపోతున్నారు. అయినప్పటికీ తాను పట్టుకున్న కుందేలుకు మూడే కాళ్లు అన్నట్టుగా ముందుకెళ్తున్నారు అమాత్యులవారు. మరి.. ఈ విషయంలో ఇబ్బంది పడుతున్న జిల్లా ప్రజాప్రతినిధుల్లో ఎవరైనా ధైర్యం చేసి.. అప్పలరాజుకు చెబుతారో లేక పార్టీ పెద్దలతో చెప్పిస్తారో అని పార్టీ నేతలతోపాటు.. అధికారులు గట్టిగానే చెవులు కొరుక్కుంటున్నారు.

# అండగా ఉంటుందనే సంకేతాలిచ్చిన బాబు

కర్నూలు, మే 27, టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన రొటీన్కు భిన్నంగా సాగింది. కర్నూలు సమావేశంలో పార్టీ కేడర్ స్పందన, రోడ్ షోలకు లభించిన ఆదరణకు ఫుల్ ఖుషీ అయ్యి కీలక ప్రకటన చేశారు. డోన్ అభ్యర్థిగా సుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. బాబు నోటి వెంట ఈ ప్రకటన రాగానే పార్టీ శ్రేణులు నివ్వెర పోయాయి. ఎన్నికలకు రెండేళ్ల ముందే అభ్యర్థిని ప్రకటించిన ఉదంతాలు లేకపోవడంతో అది చర్చగా మారింది. దీని వెనక టీడీపీ వ్యూహం ఏంటనే దానిపై ఆరా తీస్తున్నారు తెలుగు తమ్ముళ్లు.డోన్లో టీడీపీ ఇంచార్జ్గా సుబ్బారెడ్డి బాధ్యతలు చేపట్టాక కేఈ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా కరపత్రాలు వేయడం.. నిరసనలు తెలియజేయడం కలకలం రేపింది. కేఈ కుటుంబానికి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్స్ వినిపించాయి. ఆ ఎపిసోడ్లో పార్టీ అధిష్ఠానం కేఈ వర్గానికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఆ గందరగోళానికి తెరదించడానికే డోన్ విషయంలో చంద్రబాబు స్పష్టత ఇచ్చారని అనుకుంటున్నారట. వచ్చే ఎన్నికల్లో డోన్లో కేఈ కుటుంబం పోటీ చేస్తుందని కొందరు.. కోట్ల కుటుంబం నుంచి బరిలో ఉంటారని మరికొందరు రకరకాలుగా ప్రచారంచేశారు. చర్చలు పెట్టారు. అలాంటి వాటన్నింటికీ సుబ్బారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి చెక్ పెట్టారని భావిస్తున్నారు.డోన్ అభ్యర్థిత్వంపై క్లారిటీ ఇవ్వడం ద్వారా పార్టీ నేతలు చంద్రబాబు మరో మెసేజ్ పంపారని భావిస్తున్నారు. అభ్యర్థుల ప్రకటనలో ఒత్తిళ్లకు తలొగ్గబోమని, పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పడం కూడా అందులో భాగమని టీడీపీలో చర్చ జరుగుతోందట. సుబ్బారెడ్డి జైలుకు వెళ్లి వచ్చారని.. పార్టీ కోసం గట్టిగా పోరాడుతున్నారని చంద్రబాబు వేదికపైనే చెప్పారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేరును కూడా ప్రస్తావిస్తూ పార్టీ కోసం వెనక్కి తగ్గడం లేదని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన భయపడలేదని తెలిపారు. ఈ రెండు ఉదాహరణల ద్వారా కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీకి అండగా ఉన్నవారిని అక్కున చేర్చుకుంటామని చెప్పకనే చెప్పేశారు. పైగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సొంత ఊరు బేతంచెర్ల మున్సిపల్ ఎన్నికల్లో 6 వార్డులను టీడీపీ దక్కించుకోవడం వెనక సుబ్బారెడ్డి పాత్రను గుర్తించారు. అందుకే డోన్ అభ్యర్థిగా ఆయన పేరును ప్రకటించారని విశ్లేషిస్తున్నారట.డోన్ టీడీపీ అభ్యర్థిని ప్రకటించారు కానీ.. ఇకపై నియోజకవర్గంలో పరిణామాలు ఎలా ఉంటాయనేది ఆసక్తి కలిగిస్తోంది. డోన్లో బాగా పట్టున్న కేఈ వర్గం సుబ్బారెడ్డికి సహకరిస్తుందా.. లేక అసంతృప్తిని కొనసాగిస్తుందా అనేది అంతుచిక్కడం లేదట. అలాగే కోట్ల కుటుంబానికి నియోజకవర్గంలో పట్టుంది. ఈ రెండు కుటుంబాల తీరు వచ్చే ఎన్నికల నాటికి ఎలా ఉంటుందో ఊహించడం కష్టమంటున్నాయి రాజకీయ వర్గాలు. మరి.. డోన్లో చంద్రబాబు ఎత్తుగడ వర్కవుట్ అవుతుందో లేదో చూడాలి.

# ఘనంగా వర్షాల పండుగ



ఏలూరు, మే 27, వర్షంతో తడిపి భూములను సస్యశ్యామలం చేయాలని గిరిజనులు ఏటా ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ మొదటి వారం వరకు గంగాలమ్మ తల్లి పండగను నిర్వహిస్తారు. దాదాపుగా 300 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. నాడు అల్లూరి సీతారామరాజును పట్టుకోవడానికి వచ్చిన ఆంగ్లేయులు కూడా ఈ పండగను చూశారు. పంటలు పండాలంటే నీరు కావాలి. అందుకే గంగమ్మను పూజిస్తే.. తల్లి వర్షాన్ని కురిపించి పంటలను పండిస్తుందని ఇక్కడి గిరిజనుల నమ్మకం. ఇక్కడి భూములు చాలా వరకు వర్షాధారం కావడంతో వర్షం తప్పనిసరి. ఒకప్పుడు నెల రోజుల పాటు పండగ చేస్తే.. ఇప్పుడు వారానికే పరిమితమైంది. గిరిజన గ్రామాల్లో విత్తనాలు చల్లికతో ప్రతీ చోట పండగ ప్రారంభిస్తారు. కొన్ని రకాల పప్పులు, వరి విత్తనాలను గంగాలమ్మ తల్లి పేరు చెప్పి పొలంలో చల్లుతారు. ఆ విత్తనాల్లో కొన్నైనా మహిళల చీరకొంగులో పడే విధంగా చూస్తారు. అలా పడిన విత్తనాలను దాస్తారు. తర్వాత వారు వేసే విత్తనాల్లో వీటిని కలిపివేస్తారు. ఇలా వేస్తే తల్లి ఆశీస్సులతో పంటలు బాగా పండుతాయని భావిస్తారు. గ్రామాన్ని క్షేమంగా చూడాలని చిన్న ఈరేడును తయారు చేసి దానిలో బుట్టను ఉంచుతారు. చిన్న కోడిపిల్లను బలి ఇచ్చి గ్రామంలో రెండు వైపులా పొలిమేర వరకు తీసుకువచ్చి వదిలిపెడతారు. దీనిని జడిగా పిలుస్తారు.ప్రతి రోజూ సాయంత్రం సమయంలో తల్లిని ఊరేగింపుగా అన్ని గృహాల వద్దకు తీసుకెళ్తారు. కుండపై దీపం పెట్టి గంధం, పాల ఆకుల పూలు పెడతారు. ఇలా ఊరేగించిన తర్వాత అసలు పండగ చేపడతారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఊయలను ఏర్పాటు చేస్తారు. ఇందులో పెద్దల నుంచి పిల్లల వరకు అంతా సంతోషంగా ఊగుతారు. గతంలో తల్లి ఊరేగింపును దాదాపుగా నెల రోజుల పాటు చేసేవారు. ఇప్పుడు వారం రోజులకే పరిమితమైంది.తల్లికి మేకలను బలి ఇస్తారు. అనేకచోట్ల మంగళవారం రాత్రి అంతా కోలాటం, గంగా చెల్లు పాటలతో జాగారం చేస్తారు. బుధవారం ఉదయాన్నే మేకలను బలి ఇస్తారు. గతంలో కోలాటం, గంగాచెల్లు ఆటలను రాత్రి నుంచి తెల్లవారే వరకు పాడే వారు. ఇప్పుడు ఆ గంగా చెల్లును చాలా చోట్ల మానేశారు. కొంత సేపు కోలాటం ఆడుతున్నారు. మరోవైపు మేకపోతులను వేసిన తర్వాత నుంచి మహిళలు రోడ్డుకు అడ్డంగా కర్రలు పెట్టి బాసికాల పేరిట డబ్బులు వసూలు చేస్తారు. వాహనచోదకులకు పసుపు నీటిని రాస్తారు. పురుషులు కోలాటం చేస్తూ ఇంటింటికీ తిరిగి డబ్బులు వసూలు చేస్తారు. గతంలోలా కాకపోయినా.. ప్రతి గ్రామంలో ఈ పండగ నిర్వహిస్తున్నారు. మేకలను బలి ఇచ్చిన తర్వాత గ్రామంలో పెద్దలు సంప్రదాయ ఆయుధాలతో వేటకు వెళ్తారు. వేటకు వెళ్లే ముందు పూజలు నిర్వహించి పనసకాయకు బాణాలు వేస్తారు. మరికొన్ని చోట్ల అయితే పంది పిల్లకు బాణాలు వేస్తారు. గతంలో అడవి విస్తరించి ఉండడంతో పాటు వేటాడే నిపుణులు ఉండేవారు. దీంతో వేటకు వెళ్తే ఏదో ఒక జంతువును తెచ్చేవారు. ఇప్పుడు వేటలను చాలా వరకు తగ్గించారు. ఇలా వేటకు వెళ్లే ప్రతి రోజూ రాత్రి సమయంలో గౌర వేషాన్ని నిర్వహిస్తారు. జంతువు వేషధారణతో ఒకరిని తయారు చేస్తారు. అతన్ని వేటాడుతున్నట్టుగా బాణాలు వేస్తారు. చుట్టూ జనాలు ఉండి ఆటలాడుతారు. ఈ సందర్భంగా అతని తోకకు పేడ లేదా పసుపు నీరు పూస్తారు. ఇంటింటికీ తిరిగి తోకకు రాసిన పేడ లేదా పసుపు నీరును అందరికీ అంటిస్తారు. ఇదంతా సరదా సాగుతుంది.

# కాలువలకు మరమ్మత్తులు మరిచారు

ఒంగోలు, మే 27, తుపాన్లు, వరదలకు పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు ఈ ఏడాది వ్యవసాయ సీజన్ను ముందుగానే ప్రారంభించేందుకు సిద్ధమైన ప్రభుత్వం, అత్యంత ముఖ్యమైన సాగునీటి కాలువల మరమ్మతులను విస్మరించింది. ఖరీఫ్ సాగుకు జూన్ ఒకటో తేదీ నుంచే కాలువలకు నీటిని విడుదల చేయాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. కృష్ణా, గోదావరి, పెన్నా డెల్టాలు, సోమశిల, రాయలసీమ తదితర ప్రాంతాల్లో కాలువలకు నీటి విడుదల షెడ్యూల్ను కూడా ఖరారు చేసింది. అదే సమయంలో, వేసవిలో చేపట్టాల్సిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులను ప్రభుత్వం అంతగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్లుగా కోవిడ్ వల్ల ఎక్కడా పనులు జరగలేదు. అంతకముందు రెండు, మూడేళ్లు కాలువల్లో పూడికతీత పనులతోపాటు తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపు, రెగ్యులేటర్ల మరమ్మతులను ప్రభుత్వం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయకట్టు అభివృద్ధి సంస్థ (కాడా) సమావేశమై రూ.149.14 కోట్లతో 997 ఓఅండ్ఎం పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ పనుల నిర్వహణకు టెండర్లు పిలవాలా? లేక నామినేషన్లపై కేటాయించాలా? అనేది ఇంకా నిర్ధారణ అవ్వలేదు. ఓఅండ్ఎం పనులను పూర్తి చేసేందుకు కనీసం నెల రోజులపైనే సమయం అవసరం ఉంటుందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా కాలువలకు నీటిని విడుదల చేస్తే, అవి ఆయకట్టు చివరి భూములకు చేరడం కష్టమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ తొలుత కృష్ణా, గోదావరి డెల్టాలలోనే ప్రారంభమవుతుంది. గోదావరి డెల్టాకు జూన్ ఒకటిన, కృష్ణా డెల్టాకు జూన్ 10న నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో ఓఅండ్ఎం పనులు చేపట్టేందుకు సమయం ఉన్నప్పటికీ, కృష్ణా, గోదావరి డెల్టాల్లో పనులు చేపట్టేందుకు ఏమాత్రం గడువు సరిపోదు. ఈ నేపథ్యంలో కాలువలు, హెడ్ రెగ్యులేటర్స్, రెగ్యులేటర్లు, షట్టర్లకు మరమ్మతులు చేపట్టకుండానే నీటిని విడుదల చేస్తే, చివరి భూములకు నీరు చేరడం ఆలస్యమవుతుందని అధికారులు చెబు తున్నారు. గోదావరి డెల్టా కింద 10.38 లక్షల ఎకరాలు, కృష్ణా డెల్టా కింద 13.08 ఎకరాల ఆయకట్టు ఉంది.రాష్ట్రంలో డెల్టాల ఆధునికీకరణ పనులు పూర్తికాకపోవడంతో కాలువలు చాలా వరకు పూడుకుపోయాయి. కాలువ కట్టలు కూడా బలహీనంగానే ఉన్నాయి. ఐదారేళ్లుగా డెల్టాల ఆధునికీకరణ పనులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆయకట్టు చివరి భూములకు ఏటా సాగునీటి సమస్యలు తప్పడం లేదు.

శనివారం 28-05-2022

# ఎయిమ్స్ లో ఎలక్ట్రానిక్ పరామర్శ

గుంటూరు మే 27,రాష్ట్ర ప్రజలందరి సౌకర్యార్థం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆస్పత్రి మొబైల్ యాప్ ద్వారా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'ఈ?పరామర్శ' యాప్ను ఉపయోగించి.. ప్రజలు తమకు అవసరమైన వైద్య సేవలను ఇక సులభంగా పొందవచ్చు. నేరుగా ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకునే వారితో పాటు టెలీమెడిసన్ ద్వారా వైద్య సేవలు అవసరమైనవారికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆస్పత్రి అధికారులు చెప్పారు. దీనివల్ల రోగులకు సమయంతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని చెప్పారు.మొబైల్ ఫోన్లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'ఎయిమ్స్ మంగళగిరి ఈ?పరామర్శ' యాప్ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఫోన్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యి.. రోగి తన వివరాలు నమోదు చేసుకోవచ్చు. అందులోని టెలీకన్సెల్టెన్సీ ద్వారా జనరల్ మెడిసన్, దంత, నేత్ర, ఎముకల వైద్యంతో పాటు 12 రకాల వైద్య సేవలను పొందవచ్చు. అవసరమైన విభాగంలో వివరాలు నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు, శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు వైద్యులు అందుబాటులోకి వచ్చి చికిత్సకు సంబంధించిన సలహాలిస్తారు. నేరుగా ఎయిమ్స్కు వెళ్లి ఓపీలో రూ.10 చెల్లించి చికిత్స తీసుకున్న వారు.. తమ రిపోర్టులను యాప్లో తెలుసుకునే అవకాశముంది. యాప్ ద్వారానే రోగులు తమ ఆరోగ్య సమస్యలను డాక్టర్లకు వివరించవచ్చు.

# సీపీఎస్ పై యూ టర్న్

విజయవాడ, మే 27,మాట ఇవ్వడం..మాట తప్పడం జగన్ సర్కార్ కు ఈ మూడేళ్లలో ఒక అలవాటుగా మారిపోయింది. తాజగా మాట తప్పిన జాబితాలోకి సీపీఎస్ రద్దు వచ్చి చేరింది. సీపీఎస్ రద్దు చేస్తామని గత ఎన్నికలకు ముందు జగన్ హామీ ఇచ్చేశారు. జగన్ పార్టీ అధికారంలోకి రావడానికి ఈ హీమీని నమ్మిన ఉద్యోగులూ ఒక కారణమే. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచీ ఈ హామీ నుంచి వెనక్కు మళ్లడంపైనే దృష్టి పెట్టారని చెప్పాలి. పీఆర్సీ కోసం ఉద్యోగులు ఉద్యమించిన సందర్భంగా సీపీఎస్ రద్దు అంశాన్ని కూడా వారి డిమాండ్ల జాబితాలో చేర్చారు.అప్పటి నుంచి ప్రభుత్వం ఈ విషయాన్ని నీరుగార్చడం ఎలా అన్నదానిపై చాతనైనన్ని కసరత్తులు చేసింది. ప్రభుత్వ సలహాదారు సజ్జల చేత జగన్ అనుభవ రాహిత్యంతో ఈ హామీ ఇచ్చారని కూడా చెప్పించింది. అయితే సీపీఎస్ రద్దు సాధ్యమేననీ, దాని వల్ల ప్రభుత్వంపై ఎటువంటి అదనపు భారం పడదనీ సీపీఎస్ ఉద్యోగులు హేతుబద్ధంగా లెక్కలతో సహా వివరించడంతో అప్పటికి మిన్నకున్న జగన్ సర్కార్ తాజాగా సీపీఎస్ రద్దు సాధ్యం కాదని తేల్చేసింది. అధికారంలోకి వచ్చిన వారం రోజులలోగా సీపీఎస్ రద్దు చేస్తామన్న జగన్ మాట తప్పి మడమ తిప్పడమే కాదు ఏకంగా యూటర్న్ తీసుకున్నారు. సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో తాజాగా జరిపిన చర్చలలో పాత పింఛన్ విధానం అమలు సాధ్యం కాదని మంత్రుల కమిటీ కుండ బద్దలు కొట్టేసింది.అంతే కాకుండా గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని మరచిపోయి.. సీపీఎస్ విధానం అమలుకు సహకరించాలని కోరింది. అలాగే స్టాక్ మార్కెట్ లో పెట్టిన సొమ్ములు వెనక్కు వచ్చే పరిస్థితి లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల ఉద్యోగులకు చావు కబురు చల్లగా చెప్పేశారు. అయితే ఉద్యోగులు ఇందుకు ససేమిరా అన్నారు. ప్రభుత్వం అత్త సొమ్ము అల్లుడు ధారపోసినట్లు వ్యవహరిస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం స్టాక్ మార్కెట్లో పెట్టిన సొమ్ము ప్రభుత్వ సొమ్మేం కాదని, అది ఉద్యోగుల కష్టార్జితమనీ తేల్చి చెప్పారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలకు తామెందుకు నష్టపోవాలని నిలదీశారు. ప్రభుత్వ చిత్తశుద్ధి లేమి కారణంగానే సీపీఎస్ రద్దుకు తిలోదకాలిచ్చేసిందని రాజకీయ వర్గాలు సైతం విశ్లేషిస్తున్నాయి. సీపీఎస్ రద్దు చేసి చూపిన రాష్ట్రాలను చూపిస్తూ, ఆ రాష్ట్రాలు చేయగలిగినప్పుడు ఏపీ ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులను దగా చేయడమే జగన్ సర్కార్ లక్ష్యంగా కనిపిస్తోందని పరిశీలకులు అంటున్నారు.

# పెరుగుతున్న టమాటాలు

తిరుపతి, మే 27, (న్యూస్ పల్స్)టమాట క్రయ, విక్రయాలకు దేశంలోనే అతి పెద్దదైన మదనపల్లె టమాట మార్కెట్లో ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. వారం రోజులుగా



ధరలను గమనిస్తే మే 7న మొదటి రకం టమాట ధరలు కిలో రూ.24?44, 8న రూ.27?50, 9, 10న రూ.30?52, 11, 12న రూ.35?56 మధ్య ధరలు పలికితే 13వ తేదీన రూ.39?60కు చేరుకున్నాయి. శుక్రవారం మదనపల్లె మార్కెట్కు వివిధ ప్రాంతాల నుంచి రైతులు 198 మెట్రిక్ టన్నులు తీసుకువచ్చారు. బహిరంగ మార్కెట్లో నాణ్యతను బట్టి రూ.50?80 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెడుతున్నారు.మే నెలలో వివాహాది శుభకార్యాలు అధికంగా ఉండటం.. వాతావరణంలో అనూహ్యంగా చోటుచేసుకుంటున్న మార్పులు, పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మదనపల్లె నుంచి తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. బయటి మార్కెట్లలో స్థానికంగా సరుకు రాకపోవడం, డిమాండ్ అధికంగా ఉండటంతో ఇక్కడి వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేసి అక్కడికి తరలిస్తున్నారు. మే చివరి వరకు అధిక ధరలే పలుకుతాయని వ్యాపారులు చెపుతున్నారు. మార్కెట్లో టమాటకు లభిస్తున్న ధరలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# విద్యుత్ షాక్ తో మృతిచెందిన యువకుడు,

**పరామర్శించిన స్థానిక శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు**

వినుకొండ వినుకొండ పట్టణం వెల్లటూరు రోడ్డు పందరీపురం వద్ద కరెంటు లైన్ మరమ్మతులు చేస్తుండగా బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామానికి చెందిన సంపతి మన్నే పుల్లయ్య (22), అనే యువకుడు విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. విద్యుత్ కాంట్రాక్టర్ నాగేశ్వరరావు వద్ద కరెంట్ లైన్ పనుల నిమిత్తం కూలీగా వచ్చి పని చేస్తుండగా విద్యుత్ షాక్ సంబంధించి మృతిచెందగా, విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు బాధిత కుటుంబాన్ని వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు పరామర్శించారు. బాధిత కుటుంబానికి 10వేల రూపాయలు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. మీ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, మీకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బాధిత కుటుంబానికి హామి ఇచ్చారు.

# మహానాడుకు తరలి వెళ్ళిన టిడిపి నాయకులు..

మండపేట తెలుగుదేశం పార్టీ ఒంగోలులో నిర్వహించే మహానాడుకు మండపేట నుండి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండపేట నుండి బయలుదేరి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాల సందర్భంగాఒంగోలులో తెలుగుదేశం పార్టీ శ్రేణుల సమక్షంలో భారీ ఎత్తున మహానాడు కార్యక్రమం నిర్వహించనున్నారు. కరోనా నేపథ్యంలో గత రెండు సంవత్సరాలుగా మహానాడు కార్యక్రమం నిర్వహించలేదు. తెలుగు తమ్ముళ్ళు రెట్టించిన ఉత్సాహంతో ఈ సారి జరిగే మహానాడుకు భారీ ఎత్తున తరలివెళుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల ప్రతినిధులు యరగతపు బాబ్జి, ముత్యాల వెంకటరావు, పుత్సల శ్రీనివాస్, కొప్పిశెట్టి మాధవరావు, వైఆర్ కె పరమ హంస, బండి గోవింద్, కాదా ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లిలో కలెక్టర్ పర్యటన

అల్లూరి సీతారామారాజుఅల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ చింతపల్లిలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మికంగా పర్యటించారు.కాఫీ కలిపింగి యూనిట్ని సందర్శించారు గత ఏడాది 1000 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు కాఫీ రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా బయట కంపెనీలతో మాట్లాడి గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు. అనంతరం చింతపల్లి మండల ఆఫీస్ లో ఆయా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిసరాల శుభ్రత కోసం మాట్లాడారు ఎక్కడైనా చెత్త వేసినట్లయితే వారిపై చర్యలు తీసుకొని పెనాల్టీ వేయమన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మండల సిబ్బంది పంచాయతీ సెక్రటరీలు సర్పంచులు ఎంపీపీ జడ్పిటిసి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

నంద్యాల నంద్యాల జిల్లా నంద్యాల మండలం చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ శుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి హెచ్ సీ లోని అన్ని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశాడు. వైద్యులు డాక్టర్ కిషోర్ రెడ్డి కి సూచనలు చేశాడు. పీహెచ్ సీ లో . కాన్పుల సంఖ్య పెంచాలని మాతృ మరణాలు శిశు మరణా లు జరగకుండా ప్రాథమిక దశలోనే గర్భిణీ మహిళలకు రక్తహీనత లేకుండా పౌష్టిక ఆహారాన్ని అందించడం ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మరియు క్యాల్షియం టాబ్లెట్ ను అందించడం ప్రతి గర్భిణీ మహిళ ప్రతి నెల 9వ తేదీన ప్రధానమంత్రి మాతృ వందన కార్యక్రమంలో గర్భిణీ మహిళలకు అన్ని పరీక్షలు చేసి వైద్యం అందించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది నీ అలర్ట్ చేసి వాంతులు-విరేచనాలు కలుగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కిషోర్ రెడ్డిని ఆదేశించారు. పి హెచ్ సి లోని ఫార్మసీ వి భాగాన్ని ల్యాబ్ ను డెలివరీ రూమ్ ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశాడు.

# కత్తిపోట్లలో యువకుడు మృతి..

నెల్లూరు నెల్లూరు నగరంలోని టవున్ హాల్ సమీపంలో నిన్న సాయంత్రం కత్తిపోట్లకు గురైన విజయ్ కుమార్ (29)అనే యువకుడు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం సాయంత్రం దుండగుల కత్తుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ కుమార్ ను పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. మనుమసిద్దినగర్ లో తల్లితండ్రులు తో కలిసి నివాసం వుంటున్న అవివాహితుడైన విజయ్ కుమార్ అనే యువకుడు దండు వారి వీధి లోని ఒక వస్త్ర దుకాణం లో పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాలు క్రితం వినాయక చవితి సందర్భంగా మృతుడు విజయ్ తమ్ముడిని కైజర్, మసూద్, దాదా నిష్కారణంగా కొట్టడంతో వీరి ముగ్గురు పై విజయ్ తల్లితండ్రులు కేసు పెట్టగా ఆ కేసు కోర్టులో నడుస్తూ వుంది. ఈ క్రమంలో కేసు వాపసు తీసుకోవాలని ఈ ముగ్గురు నిందితులు కొన్ని నెలలుగా కత్తులతో మా ఇంటి మీదకు రావడం,మమ్మల్ని వేదింపులు కు గురిచేయడం చేస్తున్నారు. మేము భయపడి కేసు వాపసు కూడా తీసుకుంటాము అని చెప్పినా ఆ దుర్మార్గులు నిన్న మా బిడ్డను నడి రోడ్డు పై పొడిచి చంపేశారు అని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.....

# విశాఖలో మంత్రుల బస్సు యాత్ర

విశాఖపట్నం ఏపీలో రెండో రోజు సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర కొనసాగుతోంది.యాత్రలో బాగంగా విశాఖ జిల్లా గాజువాకలో పాత గాజువాకలోని మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. సామాజిక న్యాయ భేరి యాత్రలో పాల్గొన్న మంత్రులకు ఉత్తరాంధ్ర ప్రజలు ఘన స్వాగతం పలికారు. సభ ప్రాంగణం ముఖ్యమంత్రి వైయస్ జగన్ నినాదాలతో దద్దరిల్లింది.స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ..రాష్ట్రంలో సంతృప్తికర పాలన కొనసాగుతోందని,మళ్లీ సీఎం వైయస్ జగన్‌ను గెలిపిస్తామని ప్రజలు అంటున్నారని చెప్పారు.

# సంస్కృత భాష- సంప్రదాయాలకు ఆలవాలం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం

తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాధాకృష్ణ ఠాకూర్ నేడు జరిగిన పాత్రికేయుల సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ "జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత విద్యాపీఠం డీమ్డ్ యూనివర్సిటీ నుండి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంగా మారడానికి అందరి యొక్క కృషి మరువలేనిది ఈ విద్యా సంవత్సరం నుండి విశ్వవిద్యాలయంలో చేరినటువంటి విద్యార్థులకు అఖిల భారత స్థాయిలో సి యు ఈ టి సెంట్రల్ యూనివర్సిటీస్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా చేర్చు కోవడం జరుగుతుంది. సాధారణంగా విద్యాపీఠం నిర్వహించినటువంటి ప్రవేశ పరీక్షకు సుమారు 3000 దరఖాస్తు ఫారం లో వచ్చేవి కానీ ఈ సంవత్సరం సి యు ఈ టి 10,679 దరఖాస్తు ఫారములు రావడం ముదావహం. 2020 నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారము స్నాతక స్నాతకోత్తర స్థాయిలో ప్రవేశం కల్పించుటకు తగినటువంటి ఏర్పాట్లు చేయడం జరిగింది. దీనివలన విద్యార్థులకు భవిష్యత్ కాలంలో మంచి జరుగుతుంది అంటే 20 20 నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం విద్యార్థులు ఒక సంస్థ నుండి మరొక సంస్థకు మధ్యలో పైకి కావలసినటువంటి కోర్సులను చేసుకునే దానికి వెసులు బాటు కల్పించబడింది. మరొక ముఖ్యాంశం ఏమిటంటే విద్యార్థులు చదువుకునే సమయంలోనే సంపాదించుకోవాలని (ఇజీతీని లిష్ట్రతీశ్రీవ ఎనీబీ ఒవజీతీని) అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని తయారు చేయడం జరిగింది. ఈ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుమల తిరుపతి దేవస్థానముల సహాయ సహకారం లేక పోతే ముందుకు సాగదు. అందుకే టీటీడీ విద్యాలయ ప్రాంగణాన్ని పెంచుకోడానికి 14.4 ఎకరముల స్థలమును తాము ఇదివరకే ఇచ్చిన నలభై మూడు ఎకరాల స్థలానికి కలిపి ఇవ్వడం జరిగింది. ఇందువలన విశ్వవిద్యాలయం యొక్క కార్యకలాపాలను పెంపొందించుకోవడానికి మార్గం ఏర్పడింది. గత మే 7 నుండి 9 వరకు ఢిల్లీలో జరిగిన మూడు కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఉత్కర్ష మహోత్సవంలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పాల్గొని, సంస్కృతము ఏ విధంగా సమగ్ర విశ్వానికి దోహద పడుతుందో చర్చించడం జరిగింది. పి హెచ్ డి చేస్తున్న విద్యార్థులకు నెలసరి స్కాలర్షిప్పు రెండు వేల రూపాయల నుండి ఎనిమిది వేల రూపాయలకు పెంచడం జరిగింది. ఆగమ శాస్త్రం చదువుకునేటువంటి ఆగమ విద్యార్థులకు ఆగమ ప్రయోగశాలను నెలకొల్పడం జరుగుతోంది ఈ సంవత్సరం నుండి" అని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో రిజిస్ట్రార్ కమాండర్ చల్లా వెంకటేశ్వర్, ఫైనాన్స్ ఆఫీసర్ మునిష్ మాలిక్, పి ఆర్ ఓ ఆచార్య దక్షిణామూర్తి శర్మ, ఓ ఎస్ డి ఈశ్వరయ్య, సేతు రామ్,శ్రీనివాస్ మరియు ఇతర విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండవ రోజు బస్సు యాత్ర



విశాఖపట్నం వైసీపీ మంత్రులు ప్రారంభించిన సామాజిక న్యాయభేరి బస్సు యాత్రం రెండోరోజుకు చేరుకుంది. విశాఖలోని పాత గాజువాక జంక్షన్ నుంచి రెండో రోజు బస్సు యాత్ర ప్రారంభమైంది. ఈ మేరకు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమా లలు వేసి మంత్రులు బస్సు యాత్రను ప్రారంభించారు. రెండో రోజు విశాఖ, తూ.గో. జిల్లాలలో సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర జరగనుంది. లంకాలపాలెం జంక్షన్, అనకాపల్లి బైపాస్, తాళ్లపాలెం జంక్షన్, యలమంచిలి వై రోడ్డు జంక్షన్, నక్కపల్లి, తుని, అన్నవరం, జగ్గంపేట మీదుగా ఈ రోజు బస్సు యాత్ర రాజమండ్రికి చేరుకోనుంది. రెండో రోజు సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర కొనసాగుతోంది.విశాఖ జిల్లా పాత గాజువాక వైఎస్సార్ విగ్రహం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. ఈ బస్సు యాత్ర ప్రారంభానికి ముందు గాజువాకలో ఏర్పాటు చేసిన సభా వేదికపై హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. ఆంధ్రభప్రదేశ్ ముఖ్యంమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి.. కేబినెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 70 శాతం పదవులు ఇచ్చారని దేశంలో ఎక్కడా కూడా ఇలా పదవులు ఇచ్చిన దాఖలాలు లేవుని చెప్పారు. జగనన్న తప్ప గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇంత గౌరవం, రాజ్యాధికారం ఇచ్చిన వారు లేరని అన్నారు. అంతకుముందు మంత్రి వనిత మాట్లాడుతూ.. చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడ్డారు. అమలాపురం ఘటనలో టీడీపీ, జనసేన పాత్ర స్పష్టమైంది. అరెస్ట్ అయిన వారిలో ఈ రెండు పార్టీల వారే ఉన్నారని ఆధారాలు, ఫొటోలు, వీడియోలతో ఆధారంగా వారిని అరెస్ట్ చేశామని బస్సు యాత్రకి స్పందన లేదనడం చంద్రబాబు అవివేకమని అన్నారు.ప్రతీ చోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సీఎం జగన్ పాలనను ప్రశంసిస్తున్నారని తెలిపారు

# వైఎస్ఆర్ ల్యాండ్ పేరుగా మార్చండి

విజయవాడ, మే 27, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాంతాల పేర్లు మార్పుపై ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. తమ ప్రాంతం పేరు మార్చవద్దంటూ కోనసీమ వాసులు చేపట్టిన ఆందోళనలు రాష్ట్రంలో కాక పుట్టించాయి. కోనసీమ జిల్లా పేరును అంబేద్కర్ జిల్లాగా మార్చవద్దంటూ చేసిన ఆందోళనలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పేరును 'వైఎస్సార్ ప్రదేశ్'గా మార్చాలని గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు నా విన్నపమంటూ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. తెలుగు(నవశ్రీబీణబీ) ను ఓ తెగులుగా భావించి దాన్ని పీకి పారేస్తున్నాం కాబట్టి.. రాష్ట్రానికి వైఎస్ఆర్ ల్యాండ్ అని ఇంగ్లీష్ పేరు పెడితే మరీ భేషుగ్గా ఉంటుంది?' అని ట్విట్టర్లో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఈ ట్వీట్ సంచలనంగా మారింది.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పేరును "వైయస్సార్ ప్రదేశ్" గా మార్చమని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారికి నా విన్నపం.??మరో మాట: తెలుగును ఓ తెగులుగా భావించి దానిని పీకి పార వేస్తున్నాం కాబట్టి, రాష్ట్రానికి "జూఖీ ఒజీనిట" అనే ఇంగ్లీషు పేరు పెడితే మరీ భేషుగ్గా ఉంటుంది.మరోవైపు.. అమలాపురంలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. మంగళవారం జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని ఘటనకు కారకులెవరు అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలువురు పరారీలో ఉండడంతో అందుబాటులో ఉన్నవారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో అలజడికి ఆస్కారం లేదన్న అంచనాకు వచ్చే వరకు నిఘా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. రావులపాలెంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. వ్యాపారసంస్థలు తెరచుకున్నాయి. ప్రధాన కూడళ్లలో బందోబస్తు కొనసాగించారు.

# ఎంసీఎక్స్ లో భారీగా తగ్గిన బంగారం



ముంబై, మే 27, బలహీనమైన అంతర్జాతీయ పరిణామాల మధ్య బంగారం ధరలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. అమెరికన్ డాలర్, యూఎస్ బాండ్ ఈల్డ్‌లు ఇటీవలి గరిష్ఠాల నుంచి వెనక్కి తగ్గినప్పటికీ, గ్లోబల్ ఈక్విటీల్లో పుంజుకోవడం తిరిగి బంగారంపై మదుపరుల చూపుకు కారణమౌతోందని విశ్లేషకులు అంటున్నారు. ఓఅచీలో బంగారం ఫ్యూచర్స్ 10 గ్రాములకు రూ.50,925 వద్ద ఉండగా, వెండి కిలోకు 0.4% పెరిగి రూ.62,080కి చేరుకుంది. మార్చిలో, ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా బంగారం గరిష్ఠంగా రూ.55,600ని తాకింది. ఫెడ్ అందించిన వివరాల ప్రకారం ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో డాలర్ కొంత బలహీనపడింది. పైగా యూఎస్ దిగుమతులు తక్కువగా ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో బంగారం, వెండి ధరలు ప్రభావితం చెందుతాయని నిపుణులు అంటున్నారు.గ్లోబల్ మార్కెట్లలో బంగారం ధరలు 0.2% పెరిగి 1,854 డాలర్ల వద్ద ఉన్నాయి. డాలర్ బలహీనపడటం కొనసాగుతున్నందున విలువైన మెటల్ వరుసగా రెండో వారం కూడా పెరుగుదల కోసం ట్రాక్‌లో ఉంది. ఈ తరుణంలో జూన్ గోల్డ్ ఫ్యూటర్స్ ఈ రోజు రూ.50,935 వద్ద ఉండగా.. ఆగస్టు నెలవి రూ.51,080 వద్ద ఉన్నాయి. అదే వెండి విషయానికి వస్తే.. ప్రస్తుతం రూ.62 వేల మార్క్ వద్ద ఉండి. అదే జూలై సిల్వర్ ఫ్యూచర్స్ రూ.62,202 వద్ద, సెప్టెంబర్ ఫ్యూచర్స్ రూ.62,870 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. పసిడి దాదాపుగా రూ.5000 కంటే ఎక్కువగానే దిగివచ్చింది. వెండి కూడా రెండు నెలల కాలంలో దాదాపు రూ.17 వేలు తగ్గాయి. ఫెడ్ ద్రవ్య విధాన వైఖరి చర్చనీయాంశంగా ఉన్నందున ఇన్వెస్టర్ల చూపు ఈక్విటీ మార్కెట్ల వైపు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఊతంలో మార్కెట్లు రికవరీకి ప్రయత్నిస్తున్నాయి.

# మహానాడులో విందు.. భలే పసందు

ఒంగోలు, మే 27టీడీపీ మహానాడు అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ మహానాడుకు ఒక ప్రత్యేక కూడా ఉంది. టీడీపీ ఆవిర్భవించి 40 ఏళ్ళు పూర్తి కావడం.. మరోవైపు ఎన్టీఆర్ జన్మించి 99 పూర్తి అయ్యి.. శత జయంతి ఉత్సవాలకు అడుగు పెట్టడానికి సిద్ధమవుతున్న వేళ.. ఈ మహానాడు ఉత్సవాలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇక ఈ కార్యక్రమానికి రెండు రోజుల పాటు వచ్చే అతిథుల కోసం టీడీపీ భారీగా ఫుడ్ మెనూ ఏర్పాటు చేసింది.రెండు రోజుల పాటు మహానాడుకి హాజరయ్యే అతిథులకు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి డిన్నర్ ను అందించనుంది. ఇప్పటికే ఆహారకమిటీ రుచికరమైన వంటకాలను ఏర్పాటు చేసింది. మహానాడు ప్రాంగణంలో మొత్తం 11 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. ఇక ఎన్టీఆర్ పుట్టిన రోజైన మే 28న ఆయనకు ఇష్టమైన ప్రత్యేక మెనూను కూడా ఏర్పాటు చేశారు.మహానాడు ప్రాంగణంరోజుకు వచ్చిన నేతలు, కార్యకర్తలకు ప్రత్యేక వంటలు అందించనున్నారు. మొదటి రోజు 70 వేల మందికి వంటలు సిద్ధం చేస్తున్నారు. 19 రకాల వంటలతో లంచ్ ఏర్పాటు చేయగా.. 11 రకాలతో రాత్రి డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. మూడు ప్రాంతాల స్పెషల్స్ వంటలతో భోజనాల ఏర్పాటు చేస్తున్నారు.మొదటి రోజున కొబ్బరి అన్నం , బిర్యానీ, వైట్ రైస్, రైతా సహా మామిడికాయ పప్పు, వంకాయ పకోడి ఫ్రై, మునగకాయ డబుల్ బీన్స్ కర్రీ, బీరకాయ శనగపప్పు కూర, వంకాయ పకోడి ఫ్రై లతో పాటు యాపిల్ హల్వా, జిలేబీ స్వీట్స్ ను దోసకాయ వంకాయ చట్నీ, మామిడికాయ పచ్చడిలతో పాటు చిప్స్, అప్పడాలు, సాంబారు, పచ్చిపులుసు, మజ్జిగచారు, నెయ్యి, పెరుగు, ఐస్ క్రీమ్ వంటివి అతిథులకు వడ్డించనున్నారు. ఇక స్నాక్స్ గా మైసూర్ పాక్, సమోసా , పకోడి, టీ, కాఫీలను అందించనున్నారు. రాత్రి భోజనంలో టమోటా పప్పు, బంగాళదుంప ఫ్రై, లతో పాటు సేమ్యా కేసరి, అరటికాయ భజ్జీలను, చట్నీ, పప్పుచారు, అప్పడాలు, వడియాలను అందించనున్నారు.మే 28 ఎన్టీఆర్ పుట్టిన సందర్భంగా మహానాడుకి లక్షమంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

# మంథని డివిజన్లో 38 లక్షలు సీడీపీ నిధులతో అభివృద్ధి పనుల మంజూరు

**-మంథని శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

మంథని ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధుల (సిడిపి) నుండి 38 లక్షలతో పెద్దపెల్లి జిల్లా మంథని డివిజన్ కు సంబంధించి 4 మండలలోని రోడ్లు, బస్టాండ్ లు, వైకుంఠ రథం మరియు ఫ్రీజర్, బీసీ కమ్యూనిటీ హాల్, మంథని గ్రౌండ్ చుట్టూ వాకింగ్ ట్రాక్, ఎలక్ట్రికల్ పోల్స్ ఇతర పనులు మంజూరు చేయించినట్లు మంథని శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద తన ప్రతిపాదనల మేరకు పెద్దపెల్లి జిల్లా కు సంబంధించిన జిల్లా కలెక్టర్ నుండి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ద్వారా శుక్రవారం 38 లక్షల సంబంధించిన వర్క్ మంజూరు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. 1.కమాన్ పూర్ మండలం గొల్లపల్లి గ్రామం లోని బీసీ కాలనీ లో ఎలక్ట్రికల్ పోల్స్ అండ్ వైర్స్ - 3.80 లక్షలు, 2. రామగిరి మండలం ముస్త్యాల గ్రామం లో (ఎస్సి కాలనీ లో) సుందిళ్ల ఓదెలు ఇంటి నుండి సుందిల్ల వెంకటి ఇంటి వరకు 5 లక్షలు,3.మంథని మున్సిపాలిటీ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్ కోసం 5 లక్షలు, 4. మంథని మండలం కన్నాల గ్రామనికి వైకుంఠ రథం మరియు ఫ్రీజర్ కోసం 10 లక్షలు, 5.మంథని మండలం మంథని మునిసిపాలిటీ ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా మంథని ప్లేగ్రౌండ్ చుట్టూ వాకింగ్ ట్రాక్ కోసం 10 లక్షలు, 6.మంథని మండలం సిరిపురం గ్రామంలో సిరిపురం విలేజ్ కి ముందు మోడల్ బస్టాండ్ 2లక్షలు, 7.మంథని మండలం వెంకటాపురం గ్రామంలో కాటారం వైపు వెళ్లే దారిలోని వెంకటాపూర్ క్రాస్ వద్ద ముందు మోడల్ బస్టాండ్ 2 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన తెలియజేశారు. మంథని,కమాన్ పూర్, రామగిరి మండలంలకు సిడిపి కింద 38 లక్షల సంబంధించిన సీసీ రోడ్డు ఇతర పనులు మంజూరు చేసేలా కృషిచేసిన మంథని నియోజకవర్గ శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు ఆయా గ్రామలకు చెందిన సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని తాసిల్దార్ కు వినతి

మంథని పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, సీపీఎం.ఎమ్మెల్, సీపీఎం.ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ, ఎమ్ సీపీఐ. యు ఆధ్వర్యంలో మంథని తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో నిత్యం పెరుగుతున్న ప్రజల నిత్యజీవిత అవసరాల వస్తువులు, సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న పరిస్థితి ఉన్నదని, విద్యుత్ ఆర్టీసీ చార్జీలు రిజిస్ట్రేషన్ చార్జీలు పెట్రోలు, డీజిల్ వంటగ్యాస్ ధరలు తదితర ప్రజల నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకీ పేద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న నేపథ్యంలో దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెంపు, ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగుల ఆకలి కేకలతో అల్లాడుతున్న నేపథ్యంలో వామపక్ష పార్టీలుగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే ఈ రోజు వినతిపత్రం సమర్పిస్తున్నమన్నారు. ఈ విషయాలపై తమరు సానుకూలంగా స్పందించి పెరుగుతున్న ధరలను అరికట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అందుకు తగు చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నామన్నారు. పెట్రోల్, డిజిల్ పై కేంద్రం విధించిన అన్ని రకాల సెస్సులను రద్దు చేయాలని, ఎక్సైజ్ సుంకంతగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్నుల తగ్గించాలని,పెంచిన వంట గ్యాస్ ధర తగ్గిస్తూ, నిత్యవసరాలు, బట్టలు, చెప్పులపై జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేశారు. స్టీల్, సిమెంట్, ఇసుక ధరలను అదుపు చేసి దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి, 14రకాల నిత్యావసరాలు అందించాలన్నారు. అసంఘటితరంగ కార్మికులందరికీ నెలకు రూ.7,500లు ఇవ్వాలని, ఉపాధి హామి పథకానికి నిధులు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలి. ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు పుప్పాల సత్యనారాయణ,రౌతు మల్లయ్య, బూడిద గణేష్, మాచిడి సత్యనారాయణ గౌడ్, ఎమ్ ఏ. గౌస్, టి రమేష్, కుమారస్వామి,ఏ వెంకన్న, యండి చాంద్,డి. ఓదెలు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత మా బాధ్యత

**ఇంచార్జ్ డీసీపీ అఖిల్ మహాజన్**

బెల్లంపల్లి మే 27కాసిపేట మండలం దేవాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రొట్టెపల్లి గ్రామపంచాయతీ లోని పాత తిరుమల పూర్ లో పోలీస్ మీకోసం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల్ ఇంచార్జ్ డి సి పి అఖిల్ మహాజన్ ఐపిఎస్ హాజరయ్యారు.గ్రామం 40 నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు, 20 కిలోల బియ్యం, యువకులకు వాలీబాల్ కిట్లు, విద్యార్థులకు బుక్స్, నోట్స్ బుక్స్, పెన్స్ లను అందచేశారు. ఈసందర్బంగా ఇంచార్జ్ డిసిపి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ. ప్రజలకోసం ప్రభుత్వ పథకాలు , విద్యార్థుల చదువు కోసం రెసిడెన్సీయల్ స్కూల్,హాస్టల్ లను ఏర్పాటు చేశారు. తల్లితండ్రులు పిల్లల భవిష్యత్ కార్యాచరణ కోసం స్కూల్ లలో చేర్పించాలని అన్నారు. స్థానిక సమస్యలను దేవపూర్ ఎస్ఐ కి సమాచారం అందించాలి,కంటి సమస్యల పరిష్కారం కోసం లయన్స్ క్లబ్ సహకారంతో అందరికీ కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్ లు ఉచితంగా చేపిస్తామని అన్నారు. గ్రామంలో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే, పోలీసులకు సమాచారం అందించి, పోలీసులకు సహకరించాలి, గ్రామాల్లో చదువుకున్న వారు ప్రభుత్వం పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేశారు, ఆసక్తి కలిగిన అభ్యర్థులకోసం బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల ప్రాంతం లలో ఉచిత కోచింగ్ క్యాంపు లు నిర్వహిస్తున్నారు, వాటిని సద్వి?యోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, దేవాపూర్ ఎస్ఐ విజేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బంటాకుంటా లో గడప గడప కు వైస్సార్ ప్రభుత్వం

**జగనన్న పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలను ఆకర్షిస్తాయి ఎమ్మెల్యే బలనాగి రెడ్డి**

కౌతాళం ప్రభుత్వ సంక్షేమ పథకాలే జగనన్న పాలనలో పూర్వ వైభవాన్ని,ప్రజలను ఆకర్షిస్తాయని ఎమ్మెల్యే బలనాగి రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బంటాకుంటా గ్రామం నందు "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో ఎమ్మెల్యే,బలనాగి రెడ్డి, మండల నాయకులు దేశాయి కృష్ణ ,ఎంపిపి అమరేషప్ప మబుసబ్ ప్రతి గడప గడపకు వెళ్తూ జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంటికి అందించినటువంటి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొని వస్తే కచ్చితంగా పరిష్కరించే విధంగా ముందడుగు వేస్తానని అక్కడి ప్రజలకు భరోసా కల్పిస్తు హామీ ఇచ్చారు.బంటాకుంటా లో గడపగడప లో నీటి సమస్య, సొంత ఇల్లు లేక చాల మంది అల్లాడుతన్నారని ఆవేదన వ్యక్తంచేశారు.వారికి వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు, నాయకులు హామీ ఇచ్చారు. శుక్రవారం గడప గడప కు కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు ఇస్తూ ఆ పథకాల ద్వారా వారికి మూడేళ్ల లో కలిగిన లబ్ధిని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలను అమలు చేసి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. అంతేకాకుండా పేదలకు అమ్మ ఒడి, చేయూత, ఆసరా తదితర పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారన్నారు. జగనన్న అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లబ్ధిదారులకు కోరారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు ఎమ్మెల్యే నేతృత్వంలో కృషి చేస్తున్నామన్నారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో నెలకొన్న సీసీ రోడ్లు సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చర్చి నిర్మాన పనులకు 1ఒక లక్ష రూపాయలు గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దేశాయి కృష్ణ, జెడ్పీటీసీ రాదా ప్రియదర్శిని, ఎంపీపీ అమరేషప్ప,వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఏకాం బ రెడ్డి, కో అప్షన్ మెంబర్ మబుసబ్, పాల్ దినకర్,బీమా యూత్ బిమేష్, ఎంపిడిఓ సిబ్బంది,ఎంపిటిసి, సచివాలయం సిబ్బంది హోస్ ఏ ఇ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ సిబ్బంది ఏ సీ డి స్ సిబ్బంది,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ ఐ నరేంద్ర కుమార్ రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో జాయింట్ కలెక్టర్ హారేంద్ర ప్రసాద్ సమీక్ష

ఆత్మకూరు ఆత్మకూరు నియోజకవర్గ ఉప ఎన్నిక ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక అధికారులతో ఆర్డివో కార్యాలయం లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఆత్మకూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెల్లూరు జాయింట్ కలెక్టర్ హారేంద్ర ప్రసాద్ ఈ ఉపఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో చేయవలసిన ఏర్పాట్లు,ఎన్నికలపర్యవేక్షణ పోలింగ్‌బూతులఏర్పాటు,ఓటర్ లిస్టు వివరాలు, నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ వంటి పలు విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# తెలంగాణ లో అధికారంలోకి వచ్చేది బిజెపి ప్రభుత్వమే




.భారత గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారుఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐ ఎస్ బీ) 20వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారుశేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (వాః) వార్షికోత్సవానికి విచ్చేసిన భారత గౌరవ ప్రధాని నరేంద్రమోడీ గారికి సాగతం పలికిన అనంతరం సభలో పాల్గొన్నాను. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు మాట్లాడుతూ తెలంగాణలో కుటుంభం పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. తెలంగాణ ప్రజల అభిమానమే తన బలమన్నారు. తెలంగాణ ప్రజల ఆప్యాయతకు రుణపడి ఉంటామన్నారు. ఒక కుటుంబ పాలన కోసం తెలంగాణ ఉద్యమ జరగలేదన్నారు. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో కుటుంబ పాలన అంతా అవినీతిమయంగా మారింది. తెలంగాణ భవిష్యత్తు కోసం వేం పోరాటం చేస్తున్నాం. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది తెలంగాణలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం. తెలంగాణలో మార్పు తథ్యం. ప్రజలు ఈ విషయంపై ఇప్పటికే స్పష్టంగా నిర్ణయం తీసుకున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు ఈ విషయంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఒక్క కుటుంబం కోసం తెలంగాణలో అమరులు కాలేదు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది అమరులయ్యారు. వారందరికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నా. వారి ఆశయాలు నెరవేర్చాలి. భారతదేశ ఐక్యత కోసం సర్దార్ పటేల్ ఎంతో క్రషి చేశారు. ఒక ఆశయం కోసం వేలాది మంది ప్రాణ త్యాగాలు చేశారు.తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులతో పాటు ఎవరి ఆశయాలు కూడా నెరవేరటం లేదు. కుటుంబ పాలనలో తెలంగాణ బంధీ అయ్యింది. కేవలం ఒక కుటుంబం కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరగలేదు. కుటుంబ పార్టీల్ని తరిమితేనే రాష్ట్రం.. దేశం డెవలప్ అవుతుంది. తెలంగాణను టెక్నాలజీ హబ్ గా మార్చాలనుకుంటే కొందరు కుటుంబ పాలనతో బంద చేయాలనుకుంటున్నారు.బీజేపీ కార్యకర్తలపై జరిగిన దాడుల అంశం నా దృష్టికి వచ్చింది. దాడుల్లో మరణించిన బీజేపీ కార్యకర్తలకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నా.

**తెలంగాణలో మార్పు తథ్యం**
**వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలుకుదాం.**
**21వ శతాబ్దంలోనూ కొందరు మూఢనమ్మకాలు ఆచరిస్తున్నారు...**
**కుటుంబ పాలనలో ముగిసిన చోటనే అభివృద్ధి జరుగుతుంది..**
**.రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా మనం పోరాడుదాం**

పట్టుదలకు..పౌరుషానికి తెలంగాణ ప్రజలు మారుపేరు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి గారు మాట్లాడుతూ అసలు బిజెపి పేరు వింటేనే ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నులో వణుకు పుడుతోంది. ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్న బిజెపిని అణిచివేయాలని అడుగడుగునా సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నరు. ప్రధాని మోదీ గారు తీన్కుంటున్న ప్రజోవయోగ నిర్ణయాల వల్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని,భవిష్యత్ లో దేశాన్ని అన్నింటిలో అగ్రస్థానంలో నిలిపే పట్టుదల,ధైర్యం మోది గారి వద్ద వుందని ,తెలంగాణలో ప్రజల దృష్టి బీజేపీ పై మర్లిందని రాబోయే 2023 ఎన్నికల్లో ప్రజా ఆశీర్వాదంతో బీజేపీ అధికారం చేపట్ట బోతుందని అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ నియంత పాలనను ప్రజలు అణగదొక్కేందుకు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని కార్పొరేటర్ తెలిపారు. బెదిరింపులు, అబద్ధపు హామీలతో గెలవలేరని ఇప్పటికైనా తెరాస గుర్తించాలని కార్పొరేటర్ అన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ బిజెపి కార్పొరేటర్లు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, బీజేవైఎం నాయకులు, మహిళా మోర్చా నాయకులు, మహిళా నాయకులు,కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## డోన్ పట్టణములో జోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటుచేయాలి:- యు.మధుసూదన్ బాబు

**జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన ఉపాధ్యక్షుడు,**



డోన్ పట్టణములో జోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలము కేటాయించాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన ఉపాధ్యక్షుడు యు.మధుసూదన్ బాబు గారి ఆధ్వర్యంలో డోన్ మున్సిపల్ కమిషనర్ గారికి మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగినది.ఈ సందర్భంగా యు.మధుసూదన్ బాబు గారు మాట్లాడుతూ:-నంద్యాల జిల్లా, డోన్ పట్టణములో ఇంతవరకు జోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలు ఏర్పాటు చేయలేదు. కావున వీరి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి డోన్ పట్టణములో స్థలము కేటాయించి జోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు తోడ్పడి సహాయ,సహకారాలు అందించాలని కోరుతున్నము.ఈ కార్యక్రమంలో, బీసీ సంఘం నాయకులు,ఎ.ఇ. నాగరాజు గారు,జిల్లా ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్,బి. సోమన్న గౌడ్ గారు,డోన్, బిసి సంఘం, గౌరవఅధ్యక్షుడు,డి.మస్తానయ్యడోన్ బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు,బీ. ధనుంజయ్ గౌడ్,డోన్ బీసీ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి, పాల్గొనడం జరిగినది,

# నకిలీ ఇంటి పట్టాలు ప్రభుత్వ భూముల కబ్జా

బద్వేలు బద్వేలు గోపవరం మండలాల్లో భూకబ్జాలు నకిలీ ఇంటి పట్టాల వ్యవహారంలో అధికారుల వేగం తగ్గిందని విమర్శలు వస్తున్నాయి నకిలీ ఇంటి పట్టాల ఈ వ్యవహారంలో అలాగే ప్రభుత్వ భూముల కబ్జాల కీలక పాత్రధారులు ఉన్నారు వీరిలో ఒక మండల వ్యవసాయ అధికారి మరో మరో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇద్దరు ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు ముగ్గురు అధ్యాపకులు తో పాటు అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు ఉన్నారు ఎప్పుడు విలాసవంతమైన జీవితం నడిపి వీరు కేవలం భూకబ్జాలు నకిలీ ఇంటి పట్టాలు తయారీలోనే నిమగ్నమై ఉంటారు గత కొన్ని సంవత్సరాలుగా వీరికి ఇదే పని వీరు ఎవరనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం బద్వేలు ఆర్ డి ఓ ఆకుల వెంకటేశ్వర్లు రంగంలోకి దిగిన తర్వాత అసలు విషయాలు బట్టబయలయ్యాయి ఆర్ డి ఓ ఆదేశాల మేరకు బద్వేల్ పోలీసులు 17 మంది పై మొదటి విడతలో కేసు నమోదు చేశారు వీరిలో ఆరు మందిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి ఎంతో

### వేగం తగ్గించిన అధికారులు

విలువైన నకిలీ ఇంటి పత్రాలు రెవెన్యూ కార్యాలయాల ముద్రలు వందల సంఖ్యలో పలు నకిలీ పత్రాలు రెవెన్యూ అడంగల్ భూముల పాసు పుస్తకాలు నకిలీ వాస్తవ సర్టిఫికెట్లు ఇంకా పలు నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు బద్వేల్ కేంద్రంగా వీటి వ్యవహారం అవుతుంది కొందరు నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి పోలీస్ కేసుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తులు దాదాపు 60కి పైగా నకిలీ పట్టాలు చేయించుకొని వాటి ద్వారా ఇంటి స్థలాలు లక్షలు లక్ష్ లకు విక్రయించారని సమాచారం ఈ విషయాన్ని వారికి నకిలీ పట్టాలు ఇచ్చిన వారే బహిరంగంగా చెబుతున్నారు కాగా పోలీసు కేసులో ఉన్న పలువురు ముందస్తు బెయిల్ తెచ్చుకొని దర్జాగా తిరుగుతున్నారు వారి గురించి తెలిసినవారు వారితో అంటీ అంటనట్లు వ్యవహరిస్తున్నారు

# నటవారసురాలితో కుర్ర హీరో డేటింగ్?




బాలీవుడ్ లో నటవారసురాలిగా అడుగుపెట్టిన యంగ్ బ్యూటీ సారా అలీఖాన్ ప్రస్తుతం కెరీర్ పరంగా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. సారా ఇంతకుముందు హీరో సుశాంత్ సింగ్ రాజ్ పుత్ తో డేటింగ్ చేసినట్టు అంగీకరించింది. అనంతరం దివంగతుడైన సుశాంత్ జీవితంలో ట్విస్టుల గురించి తెలిసిందే. ఇకపోతే సారా అలీఖాన్ మరో యువహీరో కార్తిక్ ఆర్యన్ తో డేటింగ్ చేస్తోందంటూ కథనాలు వైరల్ అయ్యాయి.అయితే సారాతో డేటింగ్ పై కార్తీక్ క్లారిటీనిచ్చారు. కార్తీక్ ఆర్యన్ బాలీవుడ్ నటితో డేటింగ్ చేస్తున్నాడని నర్మగర్భంగా అంగీకరించాడు అతను సారా అలీ ఖాన్ వైపు వేళ్లు చూపిస్తున్నాడా? అన్నది సందిగ్ధంగా మారింది. కార్తిక్ ఆర్యన్ ఇటీవల విడుదలైన హారర్-కామెడీ చిత్రం భూల్ భూలయ్యా 2 విజయంతో రెట్టించిన ఉత్సాహంతో దూసుకెళ్తున్నాడు.ఇటీవలి ఇంటర్వ్యూలో కార్తీక్ తాను గతంలో బాలీవుడ్ యువనాయిక సారాతో డేటింగ్ చేసినట్లు వెల్లడించాడు. సారా అలీ ఖాన్ తో గుసగుసలపై స్పందిస్తూ.. ఇది నిజమే అనేలా హింట్ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తాజా మీడియా ఇంటరాక్షన్ లో.. కార్తీక్ ఆర్యన్ కి డేటింగ్ పై ప్రశ్న ఎదురైంది. గతంలో ఒక బాలీవుడ్ నటితో డేటింగ్ చేశానంటూ దీనిపై అతడు ఛమత్కరించారు. ప్రశ్నకు జవాబుగా వెంటనే ''అవును'' అని సమాధానం ఇచ్చాడు. ఇది సారా అలీ ఖాన్ తో అతని డేటింగ్ పుకార్లను ఖరారు చేస్తోంది.కార్తీక్ ఆర్యన్ - సారా అలీ ఖాన్ జంట 'లవ్ ఆజ్ కల్' సినిమా షూటింగ్ సమయంలో డేటింగ్ చేస్తున్నట్లు ఊహాగానాలు వచ్చాయి. కాఫీ విత్ కరణ్ లో సారా గురించి ప్రస్తావిస్తూ కార్తీక్ తను ఎంతో క్యూట్ గా కనిపిస్తుందని ఒప్పుకున్నాడు. ఇది చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఏది ఏమైనప్పటికీ ఈ గాసిప్స్ అనంతరం ఈ జంట వెంటనే విడిపోయారు . ఒక అగ్లీ బ్రేకప్ అయ్యిందని గొడవలయ్యాయని పుకార్లు వచ్చాయి. దీని కారణంగా ఇన్ స్టాగ్రామ్ లో ఒకరినొకరు అన్ ఫాలో చేసారు. ఇది కూడా వారి అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇటీవల కార్తిక్ - సారా ఒక అవార్డ్ షోలో తిరిగి కలుసుకున్నప్పుడు ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా మాట్లాడుకోవడంతో అభిమానులు చాలా సంతోషించారు.కార్తీక్ ఆర్యన్ నటించిన 'భూల్ భూలయ్యా 2' ఇప్పటికే రూ.54.50 కోట్లు రాబట్టింది. కార్తీక్ ఆర్యన్ - కియారా అద్వానీల భూల్ భూలయ్యా 2.. కంగన ధాకడ్ తో పాటు శుక్రవారం విడుదలైంది. మొదటి వారాంతంలో ఊహించిన దాని కంటే మెరుగైన ప్రదర్శనను అందుకుంది. విడుదలకు ముందే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్ ద్వారా రూ.3.50 కోట్లు రాబట్టింది. ఇప్పుడు మూడు రోజుల తర్వాత ఈ సినిమా మొత్తం వసూళ్లు 54.50 కోట్లకు చేరాయి. శుక్రవారం తొలిరోజు ఈ సినిమా రూ.13.50 కోట్ల వసూళ్లను సాధించింది.శనివారం ఈ చిత్రం వసూళ్లు 18 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఇప్పుడు ఆదివారం ఏకంగా 23 కోట్ల రూపాయలను వసూళ్లతో మూడు రోజులకు 50కోట్ల క్లబ్ లో అడుగుపెట్టింది. ఈ సినిమా లైఫ్ టైమ్ 100 కోట్ల క్లబ్ లో చేరుతుందని అంచనా. ఓవైపు కరణ్ జోహార్ తో విభేధించి దోస్తానా 2 నుంచి వైదొలగిన కార్తీక్ ఆర్యన్ కి ఇది పెద్ద ఊరట. కరణ్ కి వ్యతిరేకంగా అతడికి కంగన మద్ధతు కూడా లభించింది.

# నాగచైతన్య సర్కారు వారి పాట ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్

సర్కారు వారి పాట సినిమా తో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న దర్శకుడు పరశురామ్ ప్రస్తుతం నాగ చైతన్య సినిమా కోసం రెడీ అవుతున్నాడు. సర్కారు వారి పాట సినిమా కంటే ముందే నాగ చైతన్య తో ఒక సినిమా ను పరశురామ్ చేయాల్సి ఉంది. కాని కరోనా ఇతర కారణాల వల్ల సినిమాను వాయిదా వేయడం జరిగింది. సర్కారు వారి పాట ఆఫర్ రావడంతో చైతూ ప్రాజెక్ట్ ను పరశురామ్ పక్కన పెట్టాడనే వార్తలు కూడా వచ్చాయి.నాగ చైతన్య తో ప్రాజెక్ట్ ఉందని.. అది క్యాన్సిల్ కాలేదు.. కేవలం వాయిదా పడింది అంటూ సర్కారు వారి పాట సినిమా ప్రమోషన్ సమయంలో దర్శకుడు పరశురామ్ చెప్పుకొచ్చాడు. అన్నట్లుగానే ఇప్పుడు నాగచైతన్య సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ ను ముగించే పనిలో ఉన్నాడు. చైతూ థాంక్యూ మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది.




ఆ సినిమా విడుదల అయిన తర్వాత పరశురామ్ దర్శకత్వంలో మూవీ పట్టాలెక్కే అవకాశం ఉంది.పరశురామ్ దర్శకత్వంలో రూపొందబోతున్న నాగ చైతన్య మూవీకి 'నాగేశ్వరరావు' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయం లో అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. నాగేశ్వరరావు టైటిల్ ను పరిశీలిస్తున్నట్లుగా గతంలో కూడా వార్తలు వచ్చాయి. మరి ఈ టైటిల్ విషయంలో దర్శకుడు పరశురామ్ ఎలాంటి స్పందన తెలియజేస్తాడు అనే విషయమై ఆసక్తి నెలకొంది.నాగ చైతన్య మూవీకి అక్కినేని ఫ్యాన్స్ అందరిని సంతృప్తి పర్చే విధంగా నాగేశ్వరరావు టైటిల్ పెడితే కచ్చితంగా సగం విజయం సాధించినట్లే అనేది కొందరి అభిప్రాయం. రవితేజ మూవీకి ఇటీవల రామారావు అనే టైటిల్ ను పెట్టడం వల్ల అందరి దృష్టిని ఆకర్షించగలిగారు. అందుకే ఈ సినిమా కు నాగేశ్వరరావు టైటిల్ పెట్టడం వల్ల ఖచ్చితంగా పాజిటివ్ రెస్పాన్స్ దక్కే అవకాశం ఉంది.నాగ చైతన్య మరియు పరశురామ్ కాంబో సినిమాకు సంబంధించిన నటీ నటులు మరియు ఇతర వివరాలను జులై తర్వాత వెల్లడించే అవకాశం ఉంది. మరో వైపు నాగ చైతన్య అమెజాన్ కోసం విక్రమ్ కే కుమార్ దర్శకత్వంలో ఒక వెబ్ సిరీస్ ను చేస్తున్న విషయం తెల్సిందే. థాంక్యూ మరియు వెబ్ సిరీస్ ల తర్వాత ఒక రెగ్యులర్ కమర్షియల్ మూవీగా పరశురామ్ మూవీ ఉంటుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు.

# సురేష్ బాబు మరో చిన్న సినిమా

టాలీవుడ్ బడా నిర్మాతల్లో సురేష్ బాబు కూడా ఒకరు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాని గత కొన్ని సంవత్సరాలుగా సురేష్ బాబు నుండి పెద్ద సినిమాలు కాకుండా మీడియం రేంజ్ సినిమాలు.. చిన్న సినిమాలు.. కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు మాత్రమే వస్తున్నాయి. చిన్న సినిమాలు మీడియం రేంజ్ సినిమాలతోనే ఎక్కువ లాభాలు దక్కించుకుంటున్న సురేష్ బాబు మళ్లీ మళ్లీ చిన్న సినిమాలనే నిర్మిస్తున్నారు.చిన్న సినిమాలను కూడా పూర్తిగా సొంతంగా బడ్జెట్ పెట్టకుండా తమ బ్రాండ్ వ్యాల్యూతో ఇతర నిర్మాతలతో కలిసి నిర్మించి భారీగా ప్రమోట్ చేస్తున్నారు. తద్వారా 25 పైసల పెట్టుబడితో రూపాయి లాభం ను సురేష్ బాబు దక్కించుకుంటున్నారట. అందుకే బ్యాక్ టు బ్యాక్ సురేష్ బాబు చిన్న సినిమాలను చేస్తున్నారు. ఆయనను చూసి మరి కొందరు కూడా చిన్న సినిమాల వైపు పడుతున్నారు.సురేష్ ప్రొడక్షన్స్ నుండి మరో చిన్న సినిమా రాబోతుంది. అదే 'రాజమండ్రి రోజ్ మిల్క్'. ఈ సినిమా ప్రదీప్ ఉప్పలపాటితో కలిసి సురేష్ బాబు నిర్మిస్తున్నాడు. నాని బండ్రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను అతి త్వరలోనే విడుదల చేయబోతున్నట్లుగా ఒక ప్రీ లుక్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ప్రీ లుక్ తోనే సినిమాపై ఆసక్తి కలిగించారు.కాలేజ్ లేదా స్కూల్ ఏజ్ లవ్ స్టోరీతో ఈ సినిమా ఉండబోతున్నట్లుగా ప్రీ ఏజ్ పోస్టర్ చూస్తుంటే అర్థం అవుతుంది. ఈ సినిమాలో నటినటులు కొత్త వారే అన్నట్లుగా సమాచారం అందుతోంది. ఈ సినిమా సురేష్ బాబు బ్యానర్ నుండి వస్తుంది కనుక అంతా కొత్త వారే అయినా కూడా ఖచ్చితంగా ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ చేయడంతో పాటు తప్పకుండా అన్ని చోట్ల కూడా మంచి బిజినెస్ అయ్యే అవకాశం ఉంది.సురేష్ బాబు బ్యానర్ లో ఇప్పటికే నాలుగు అయిదు చిన్న.. మీడియం రేంజ్ సినిమాలు రూపొందుతున్నాయి. ఆ సినిమాలతో పాటు ఈ సినిమా కూడా జాయిన్ అయ్యింది. లవ్ స్టోరీలకు ఎప్పుడు కూడా మంచి ఆధరణ ఉంటుంది. కనుక ఈ సినిమా తో సురేష్ బాబు మరో చిన్న సినిమా పెద్ద హిట్ కొట్టే అవకాశాలు ఉన్నాయంటూ వార్తలు వస్తున్నాయి. అతి త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

# క్వాలిఫైయర్-2లో గెలుపు వారిదే.. టైటిల్ కొట్టేదీ వాళ్లే: హర్భజన్ సింగ్




ఐపీఎల్-2022 సీజన్ తుది అంకానికి చేరుకుంది. రాజస్తాన్ రాయల్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య శుక్రవారం(మే 27) క్వాలిఫైయర్-2 జరుగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు మే 29న గుజరాత్ టైటాన్స్‌తో జరుగనున్న టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ క్యాష్ రిచ్ లీగ్ తాజా ఎడిషన్ విజేత ఎవరో అంచనా వేశాడు.ఈసారి ఆర్సీబీ తమ తొలి ఐపీఎల్ టైటిల్ అందుకుంటుందని పేర్కొన్నాడు. ఈ మేరకు భజ్జీ మాట్లాడుతూ.. "బెంగళూరు జట్టులో గొప్ప ఆటగాళ్లు ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగం పటిష్టంగా ఉంది. జట్టుకు ట్రోఫీ అందించగల సత్తా గల ప్లేయర్లు ఉన్నారు.రాజస్తాన్‌తో మ్యాచ్‌లో ఆర్సీబీ కచ్చితంగా గెలుస్తుందని నా మనసు చెబుతోంది. అదే జరిగితే ఫైనల్లో కూడా గెలిచి వారు ఈసారి కప్ అందుకోవడం ఖాయం" అని స్పోర్ట్స్‌కీడాతో వ్యాఖ్యానించాడు. సమిష్టి కృషితో పోరాడితే ఈసారి ఆర్సీబీ టైటిల్ విజేతగా నిలుస్తుందని పేర్కొన్నాడు. బెంగళూరు బలమైన ప్రత్యర్థి అని వారిని ఆపడం అంత తేలికేమీ కాదని పరోక్షంగా రాజస్తాన్‌కు వార్నింగ్ ఇచ్చాడు.కాగా లీగ్ దశలో ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించడంతో ఆర్సీబీ ప్లే ఆఫ్స్ చేరుకున్న సంగతి తెలిసిందే. పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్న ఫాఫ్ డుప్లెసిస్ బృందం.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడించి క్వాలిఫైయర్-2కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో రాజస్తాన్‌తో పోటీ పడనుంది.ఇక ఇందులో గెలిచి.. ఫైనల్లో గుజరాత్‌ను ఓడించి ఆర్సీబీ టైటిల్‌ను ముద్దాడాలంటూ బెంగళూరు ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. "ఈసారి కప్పు మాదే" అంటూ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. అయితే, వారి ఆశ నెరవేరాలంటే ఆర్సీబీ ఇంకా రెండు విజయాలు సాధించాలి మరి!

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**